ప్రజలకు రాచమార్గాలు

- కొండవాలు ప్రాంతీయుల రహదారి కష్టాలకు చెల్లు
- శ్రీరామ్‌నగర్ కాలనీలో సీసీరోడ్లతో తీరిన అవస్థలు
- రూ.80 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు


సీసీరోడ్డుగా నిర్మించిన శ్రీరామ్‌నగర్ కాలనీ ప్రధాన రహదారి


కొండవాలు ప్రాంతంలో నిర్మించిన రహదారి

అగనంపూడి: కొండవాలు ప్రాంతంలో రహదారి కష్టాలకు ఫుల్‌స్టాప్ పడింది. దశాబ్ద కాలంగా రాళ్లు తేలిన రహదారులతో ఫీట్లు చేసే కొండవాలు ప్రాంత ప్రజలకు సీసీ రోడ్డు నిర్మాణంతో అవస్థలు తీరిపోయాయి. గత ప్రభుత్వంలో ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోకపోవడంతో మట్టి రోడ్డుతో కాలనీవాసులు పడిన ఇక్కట్లు ఎట్టకేలకు తీరాయి. జీవీఎంసీ 85వ వార్డు శ్రీరామ్‌నగర్ కాలనీ ఫేజ్ – 2లో సుమారు 200 కుటుంబాలు నివసిస్తున్నాయి. కొండవాలు ప్రాంతం నుంచి వినాయకనగర్ కాలనీని అనుసంధానించేలా మార్గం నిర్మించాలని అప్పట్లో పాలకులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోకపోవడంతో మట్టి రోడ్డులో రాకపోకలు సాగించేందుకు స్థానికులు అవస్థలు పడేవారు. వినాయకనగర్ నుంచి వంద మీటర్ల నిడివిలో రహదారి నిర్మించి చేతులు దులిపేసుకున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, ప్రసాద్ చొరవతో రూ.45లక్షలతో శ్రీరామ్‌నగర్ కాలనీ ఫేజ్ – 1, 2ల అనుసంధాన రహదారి నిర్మాణం చేపట్టారు. తర్వాత కొండవాలు ప్రాంతంలోని ప్రజల రహదారుల ఇబ్బందులు తీర్చడానికి మరో రూ.35 లక్షలతో జెడ్ ఆకారంలో రహదారులు నిర్మించారు. గతంలో పాలకులు పట్టించుకోకపోవడం, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు సౌకర్యాలు కల్పించేందుకు ముందుకు రావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు కష్టాలు తీరిపోయాయి



కొండవాలు ప్రాంతంలో ఉండడం వల్ల రాళ్లు తేలిపోయి, కంకర రాళ్ల రోడ్డులో ఇబ్బందులు పడేవాళ్లం. కొండ దిగువకు వెళ్లాలంటే వాహనాలు జారిపోయి పడిపోయేవాళ్లం. ప్రధాన రహదారిని సీసీ రోడ్డుగా మార్చడంతో రోడ్డు కష్టాలు తీరిపోయాయి. గతంలో పలుమార్లు రహదారి నిర్మించాలని వినతులు సమర్పించినా ఆనాటి పాలకులు పట్టించుకోలేదు. –డి.ప్రకాష్, శ్రీరామ్‌నగర్‌కాలనీ

వర్షాకాలంలో నరకయాతన



మట్టి రోడ్లతో వర్షాకాలం నాలుగు మాసాలపాటు పాట్లు పడేవాళ్లం. నడిచి వెళ్లడానికి కూడా ఇబ్బంది పడేవాళ్లం. వాహనాలు బురదలో కూరుకుపోయేవి. సీసీరోడ్లు నిర్మించడంతో రహదారుల ఇక్కట్లు తీరిపోయాయి. ఎట్టకేలకు రోడ్డు నిర్మించడంతో సంతోషంగా ఉంది. – ఎం.ప్రసాద్, కాలనీవాసి

రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం



వార్డులో రహదారులు, డ్రైనేజీల నిర్మాణానికి అధిక ప్రాధాన్యమిస్తున్నాం. కాలనీలో రోడ్లు లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడేవారు. కొండవాలు ప్రాంతంలో ప్రజల ఇక్కట్లు తీర్చడం మొదటి ప్రాధాన్యతగా భావించాం. పెందుర్తి, గాజువాక ఎమ్మెల్యేల సహకారంతో వార్డులో కనీస వసతులైన రహదారులు, డ్రైనేజీలు పూర్తిస్థాయిలో నిర్మిస్తున్నాం.

– ఇల్లపు వరలక్ష్మి, 85వ వార్డు కార్పొరేటర్

క్లుప్తంగా

ట్యాంకర్లతో నీరు సరఫరా


ట్యాంకర్ నుంచి నీరు తీసుకెళ్తున్న స్థానికులు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ నీటి విభాగ కార్మికులు గత వారం రోజులుగా సమ్మె చేస్తుండడంతో 86వ వార్డులోని ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గమనించిన వైఎస్సార్ సీపీ 86వ వార్డు ఇన్‌చార్జి, పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి దామా సుబ్బారావు సొంత నిధులతో దామా ఫౌండేషన్ తరఫున ట్యాంకర్లతో వార్డులోని పలు ప్రాంతాల ప్రజలకు నీరు సరఫరా చేశారు. దీంతో స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

బాలాజీకి గులాబీలతో సహస్రనామార్చన


గులాబీలతో అర్చన నిర్వహించిన దృశ్యం


అక్కిరెడ్డిపాలెం: ధనుర్మాసం సందర్భంగా షీలానగర్‌లోని ఎస్టీబీఎల్ ప్రాంగణంలో కొలువైన బాలాజీకి గులాబీలతో సహస్ర నామార్చన నిర్వహించారు. తిరుప్పావై పాశురాలు పఠనం, సుప్రభాతం, తోమాల సేవ నిర్వహించారు. శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

వైభవంగా తిరువీధి ఉత్సవం


ఊరేగిస్తున్న ఉత్సవమూర్తులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–1లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం తిరువీధి ఉత్సవం వైభవంగా జరిగింది. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఉత్సవమూర్తులను రథంపై ఊరేగించారు. పెద్ద సంఖ్యలో హాజరైన భక్తుల సమక్షంలో జరిగిన ఊరేగింపు నమో వెంకటేశ నామంతో మార్మోగింది. ఈ సందర్భంగా స్వామికి పంచామృతాభిషేకాలు చేశారు. అంతకు ముందు స్వామికి వేకువజామున ఆలయ అర్చకులు భావనారాయణస్వామి, ఉదయ కృష్ణమాచార్యులు, హరినారాయణ నేతృత్వంలో ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, పలువురు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీ సేవా సంఘం ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో గౌరీ సేవా సంఘం ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ వేంకటేశ్వరకాలనీ గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో పోర్టు రోడ్డులో గల దాసరి పైడితల్లమ్మ అమ్మవారి ఆలయం వద్ద సంఘం ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ప్రతినిధులు ముందుగా గౌరీమాత చిత్రపటానికి పూలమాలలు వేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం గౌరీ సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ అధ్యక్షునిగా ఆళ్ల రాంప్రసాద్, అధ్యక్షునిగా పెంటకోట ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షునిగా మద్దాల శ్రీనివాసరావు, కార్యదర్శిగా మళ్ల నగేష్ కుమార్, కోశాధికారిగా శరగడం రామచంద్రరావుతోపాటు 13 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

స్వీయ రక్షణకు కరాటే తప్పనిసరి


కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్షల్లో ఉతీర్ణులైన విద్యార్థులను అభినందిస్తున్న అతిథులు

అగనంపూడి: స్వీయ రక్షణకు కరాటే విద్యను తప్పనిసరిగా నేర్చుకోవాలని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు నాగేశ్వరరావు అన్నారు. అగనంపూడి శనివాడకు చెందిన రియల్ చాంపియన్‌షిప్ అకాడమీ విద్యార్థులు 100 మంది బెల్ట్ గ్రేడింగ్ పరీక్షల్లో ఉత్తీర్ణత పొందారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమీ నిర్వాహకులు బాబీ, చీఫ్ ఎగ్జామినర్ సున్, నాయకులు గవర సోమశేఖర్, మేడిశెట్టి విజయ్, బలిరెడ్డి సత్యనారాయణ, కర్రి దేశేంద్ర, బొబ్బరి సూరి, తదితరులు పాల్గొన్నారు.

నలుగురు గంజాయి నిందితులకు రిమాండ్

వేర్వేరు ఘటనల్లో 11 కేజీల గంజాయి, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం

మల్కాపురం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ముగ్గురు వ్యక్తులు గంజాయి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వివరాలిలా.. టాస్క్‌ఫోర్స్, ఐదో పట్టణ పోలీసులకు అందిన సమాచారం మేరకు సంయుక్తంగా దాడులు నిర్వహించగా తమిళనాడులోని మదురై ప్రాంతానికి చెందిన కాజా మైదీన్ ఇబ్రహీం, కర్ణాటక బెంగుళూరుకు చెందిన మనీష్, చేతన్‌కుమార్ అనే ముగ్గురు వ్యక్తులను ఊర్వశి జంక్షన్ వద్ద పట్టుకుని వారిని విచారించారు. అరకు నుంచి గంజాయిని బెంగుళూరుకు తరలిస్తున్నట్టు తేలింది. దీంతో వారి వద్ద నుంచి 5 కేజీల గంజాయి, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

జల్సాల కోసం..

విలాసాలకు అలవాటు పడి డబ్బు సంపాదించాలనే నెపంతో గుంటూరుకు చెందిన సింగు యోగేష్‌బాబు అనే యువకుడు తనకు కొత్తగా పరిచయమైన హనీష్ వర్మ అనే స్నేహితుడు ఇచ్చిన సలహా మేరకు గంజాయి విక్రయించాలనుకున్నాడు. ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం అతడు గంజాయి తరలిస్తున్నారు. టాస్క్‌ఫోర్స్, ఐదో పట్టణ పోలీసులకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా జ్ఞానాపురం ఫ్లై ఓవర్ వద్ద యోగేష్‌బాబును పట్టుకుని విచారించారు. అరకులోని పరశురాం అనే వ్యక్తి వద్ద 6 కేజీల గంజాయి కొని గుంటూరు తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. అతడి వద్ద నుంచి ఆరు కేజీల గంజాయి, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. సీఐ ఎస్.భాస్కరరావు మిగతా వ్యక్తుల కోసం కేసు దర్యాప్తు చేపట్టారు.

బీసీ సభకు బీజేపీ నాయకులు


ర్యాలీని ప్రారంభిస్తున్న కరణంరెడ్డి నర్సింగరావు

గాజువాక: బీజేపీ ఆధ్వర్యంలో నగరంలో ఆదివారం నిర్వహించిన బీసీ సామాజిక చైతన్య సభకు ఆ పార్టీ గాజువాక నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ర్యాలీని బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గాజువాక జోన్‌లోని 20 వార్డుల నుంచి రెండు వేల మంది కార్యకర్తలు, నాయకులు సభలో పాల్గొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బొండా ఎల్లాజీరావు, సోంబాబు, గూటూరు శంకరరావు, నాగేశ్వరరావు, వెన్నా శ్రీరామ్మూర్తి, జీలకర్ర భువనేశ్వరి, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు ఏకాదశి ఆర్జిత సేవలు


మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు


గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వేడుకగా నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ తులసీ దళార్చన నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. 108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. అర్చకుడు రఘునాథ్ ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు. సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం గరుడసేవ ఘనంగా జరిగింది. వెండి గరుడ వాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అదిష్ఠింపజేసి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు.

నిత్యావసర సరకుల పంపిణీ


నిత్యావసర సరకులు అందిస్తున్న సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి సమీప దిబ్బపాలెం, కొండయ్యవలసలలో అనారోగ్యంతో బాధపడుతున్న ముగ్గురికి సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ సాయం అందించింది. అనారోగ్యంతో ఒకరు, రోడ్డు ప్రమాదంలో గాయపడిన మరో ఇద్దరు ఇంటికే పరిమితం కావడంతో ఆ కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న అగనంపూడికి చెందిన సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ నెలకు సరిపడా బియ్యం, పప్పులు, నూనెలు, ఇతర వంట సామగ్రిని అందజేశారు. అతిథులు గవర నరసింగరావు, గంధోళి నరసింగరావు, ట్రస్ట్ ప్రతినిధులు మారా మస్తాన్‌రెడ్డి, పట్టా రామ అప్పారావు, గుడే సుశీలా గజేంద్రరావు, జామి గణేష్, శీరంశెట్టి గోవిందరావు పాల్గొన్నారు.

ముగిసిన సైన్స్ అండ్ ఆర్ట్ ఎగ్జిబిషన్

ఉక్కునగరం: స్థానిక శ్రిష్టి వరల్డ్ పాఠశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సైన్స్ అండ్ ఆర్ట్స్ ఎగ్జిబిషన్ ఆదివారం ముగిసింది. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు ప్రాజెక్ట్స్, వర్కింగ్ మోడల్స్ ద్వారా ప్రతిభ చాటారు. సుమారు 1800 మంది విద్యార్థులు తాము తయారు చేసిన వస్తువులను ఎగ్జిబిషన్‌లో అందుబాటులో వుంచి ఆహుతులకు వివరించారు. కార్యక్రమంలో ఎంఈవోలు జి.సాయి శైలజ, ఎం.దివాకర్, పాఠశాల డైరెక్టర్ పి.సుశీలారాణి, ఈడీ కె.మేఘన, చీఫ్ ప్రిన్సిపాల్ శ్రీధర్‌బాబు, ప్రిన్సిపాల్ ఈ.చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'చదువంటే మాకిష్టం'


కథల పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

పెదగంట్యాడ: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం జరిగిన చదువంటే మాకిష్టం కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. గ్రంథాలయ శాఖాధికారి రమణ విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించారు. అందులోని నీతిని బోధించారు.

ఆర్ట్ అండ్ క్రాఫ్ట్స్‌పై శిక్షణ


తయారు చేసిన వాల్ డెకరేటివ్స్‌ను ప్రదర్శిస్తున్న చిన్నారులు

సీతంపేట: విశాఖ పౌర గ్రంథాలయం, భారతీయ విద్యాభవన్ సంయుక్తంగా ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలోని మియావాకీ సెంటర్‌లో స్టోరీ టైం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ట్రైనర్ రబియ నవాజ్ 1 నుంచి 4వ తరగతి విద్యార్థులకు కాగితంతో వాల్ డెకరేటివ్స్ తయారీ, 5 నుంచి 8వ తరగతి విద్యార్థులకు నేమ్ ప్లేట్స్ తయారీపై శిక్షణ ఇచ్చారు. కొందరు పిల్లలు తమ తల్లిదండ్రుల కోసం బహుమతులు రూపొందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ పిల్లలను ఆర్ట్ అండ్ క్రాఫ్ట్స్‌లో నిమగ్నం చేయడం వల్ల వారిలో స్కిల్స్, ఆలోచనా విధానం, ఊహాశక్తి మెరుగవుతాయని చెప్పారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ దుర్గారాణి పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు

- వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు
- 88వ వార్డులో ఉత్సాహంగా పాదయాత్ర
- ఘన స్వాగతం పలికిన కాపు జగ్గరాజుపేట గ్రామస్తులు


మహిళకు కరపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందు

అగనంపూడి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కుల, మతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా మంజూరు చేస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ గాజువాక ఇన్‌చార్జ్ ఉరుకూటి రామచంద్రరావు(చందు) తెలిపారు. 88వ వార్డు కాపు జగ్గరాజుపేటలో ఆదివారం ఆయన పాదయాత్ర నిర్వహించారు. ముందుగా ఆయనకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం చందు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో జరిగిన ప్రగతిని వివరించారు. ఈ సందర్భంగా చందు మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం అవ్వాతాతలు, వితంతువులకు పింఛన్‌ను రూ.3వేలకు పెంచారని, ఆ కృతజ్ఞతలు చాటుకోవడానికి లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారన్నారు.

అంబేడ్కర్ స్ఫూర్తితో సీఎం జగన్ పాలన

బడుగు, బలహీన, నిమ్నజాతుల అభ్యున్నతి కోసం పాటుపడిన అంబేడ్కర్ అడుగుజాడల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారని చందు అన్నారు. విజయవాడలో త్వరలో ప్రతిష్ఠాత్మకంగా అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం చేపడుతున్నారని, ఇది రాష్ట్రంతో పాటు దేశ ప్రజలు గర్వించదగిన ఘట్టమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గ స్థాయిలో పండగ వాతావరణంలో నిర్వహించాలని సీఎం ఆదేశించారని, ఈ మేరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా 88వ వార్డు కాపు జగ్గరాజుపేటలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఆయన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ చొప్పా నాగరాజు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దామా సుబ్బారావు, వార్డు ఇన్‌చార్జ్ గంధ్రెడ్డి కనక మహాలక్ష్మినాయుడు, గాజువాక క్లస్టర్ అధ్యక్షుడు బొడ్డ గోవింద్, జేసీఎస్ కోఆర్డినేటర్ వాడపల్లి రామచంద్రరాజు, దాడి నూకరాజు, సచివాలయ కన్వీనర్లు నమ్మి ప్రసాద్, మాడిశ అప్పలరాజు, శివగణేష్, మచ్చా మహేష్, గుంట్ల లక్ష్మి, మాడిశ రాజు, బోడి వెంకటేష్, సంగ్రాన అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం నిర్ణయాలతో కార్మికులకు అన్యాయం


1060వ రోజు దీక్షా శిబిరంలో నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న కుటిల నిర్ణయాలకు కార్మికులు బలవుతున్నారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులన్నారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్న వారి సంఖ్య నానాటికీ పెరగడంతో అన్ని పరిశ్రమల వద్ద దేశవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నాయన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద 1060వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షల్లో పలువురు కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం ప్రభుత్వ రంగంలోనే కొనసాగుతుందని భారత ప్రధాని నరేంద్రమోడీ స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశ సంపదను సృష్టించలేని కేంద్ర ప్రభుత్వానికి, అమ్మే హక్కు లేదని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకుని స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోవాలని కోరారు. పోరాట కమిటీ, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

3కే మారథాన్‌కు అనూహ్య స్పందన


3కే మారథాన్‌లో పాల్గొన్న విద్యార్థులు

గాజువాక: రోగాల బారి నుంచి గుండెను కాపాడుకుందాం నినాదంతో పల్లా కార్తీక్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ఇక్కడ 3కే మారథాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యువతీ యువకుల నుంచి అనూహ్య స్పందన లభించింది. పాత గాజువాక 60 అడుగుల రోడ్‌లో ప్రారంభమైన మారథాన్ సినిమా హాల్ జంక్షన్, కొత్త గాజువాక పెట్రోల్ బంక్ వరకు, అక్కడి నుంచి తిరిగి పాత గాజువాక వరకు కొనసాగింది. యువత, స్వచ్ఛంద సంస్థలు, పౌర సంఘాలు, వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రస్టు అధ్యక్షుడు పల్లా కార్తీక్ మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యం కోసం రోజూ వ్యాయామం తప్పనిసరిగా చేయాలన్నారు. అనంతరం మారథాన్‌లో పాల్గొన్న వారికి టీ షర్టులు, సర్టిఫికెట్లు, ట్రోఫీలు అందజేసి అభినందించారు.

పింఛన్ల అందజేత


పింఛన్లు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు దిబ్బపాలెం వార్డు సచివాలయ పరిధిలో కొత్తగా మంజూరైన లబ్ధిదారులకు వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి యలమంచిలి అప్పారావు పింఛన్ అందజేశారు. ప్రతి ఒక్క అర్హునికి పింఛన్‌తో పాటు పథకాలు అందించే ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కుతుందని అప్పారావు అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కృష్ణ ప్రసాద్, బొట్టా గంగరాజు, నరసింహారావు, మొలి దీపిక, చిన్నారి, అర్చన, దేవి పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే ఐఎన్‌టీయూసీ ధ్యేయం


మంత్రి రాజశేఖర్‌ను సత్కరిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

పెదగంట్యాడ: కార్మికుల సంక్షేమమే ఐఎన్‌టీయూసీ ధ్యేయమని ఇంటక్ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. జీవీఎంసీ 64వ వార్డు గంగవరం గ్రామంలో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక సంఘ నాయకునిగా ఉంటూ ఎన్నో సమస్యలను పరిష్కరించానని తెలిపారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అవతారం, బీఎస్ రాజు, కారి పెంటయ్య, సత్యారావు, రమేష్, పల్లం గోపీ తదితరులు పాల్గొన్నారు.

33,286 మందికి కంటి శస్త్ర చికిత్సలు

- శంకర్ ఫౌండేషన్ డీజీఎం బంగార్రాజు


శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి

సింహాచలం: నేత్ర వైద్య సేవల్లో నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి అద్భుత పనితీరు కనబరుస్తోందని ఆస్పత్రి డీజీఎం కె. బంగార్రాజు తెలిపారు. 2023లో నిర్వహించిన శస్త్ర చికిత్సలు, ఇతర వివరాలను ఆదివారం ఆయన వెల్లడించారు. 2023లో 33వేల 286 కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించినట్టు తెలిపారు. 1997లో ఆస్పత్రి స్థాపించిన నాటి నుంచి ఇప్పటి వరకు 4లక్షల 33వేల 286 కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించిందని తెలిపారు. రెటీనా, గ్లకోమా,కార్నియా వంటి ప్రత్యేక కంటి శస్త్ర చికిత్సల్లో ఉత్తమ ప్రగతి సాధించిందన్నారు. డాక్టర్ వైఎస్సార్‌సీ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 58 శాతం పైగా రోగులకు కంటి వైద్య సేవలు అందించామన్నారు. 2023లో గ్లకోమా నివారణకు ఒక రోగికి గ్లకోస్ ఐస్టంట్ శస్త్ర చికిత్స తొలిసారిగా నిర్వహించి రికార్డు సృష్టించినట్టు తెలిపారు. గాజువాక బీసీ రోడ్డులో అత్యాధునిక ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేసిన ఆస్పత్రిలో సేవలు సంక్రాంతి నుంచి అందుబాటులోకి వస్తాయన్నారు. గ్రామాల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించడం ద్వారా అంధత్వ నివారణకు శంకర్ ఫౌండేషన్ ఎంతో కృషి చేస్తోందని తెలిపారు.